క్లుప్తంగా

మహిళా చట్టాలపై అవగాహన



మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వీరవాసరం మండలం పరిధిలో బాల్య వివాహ నిషేధ చట్టం, ఫోక్సో చట్టాలపై సీఎంపీఓలకు శిక్షణ ఇచ్చారు. మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యకర జీవనాన్ని గడపాలని వక్తలు సూచించారు. తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎండీఓ విజయ సారథి, ఎంఈఓ శివన్నారాయణ, సీహెచ్ఓ దేవదాసు, సీడీపీఓ టీకేవీ లక్ష్మీ కాంతం, డీసీపీఓ ఆఫీస్ సోషల్ వర్కర్ అనిత, సూపర్‌వైజర్స్ సరోజిని గీత మండలంలో ఉన్న గ్రామ స్థాయి కమిటీ సభ్యులు, వీఆర్వో, జీఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా ఏకాగ్రత వృద్ధి



ధ్యాన శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

వీరవాసరం: నేలపోగుల ఎంపీయూపీ స్కూలు ప్రధానోపాధ్యాయులు కె.రూజ్ వెల్ట్ అధ్యక్షతన ఉచిత ధ్యాన శిక్షణను బుధవారం నిర్వహించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎస్ సుబ్బరాజు జ్ఞానబోధ చేశారు. విద్యార్థులు ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత జ్ఞాపకశక్తి పెరుగుతుందని తెలిపారు. ఎన్ని సంవత్సరాల వయసైతే అన్ని నిమిషాలు రోజుకు రెండు సార్లు విధిగా ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నాగన్న, షాకీర్ ఉన్నిషా, గుత్తుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ' ఓటు నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పు, పశ్చి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపట్టినట్టు తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో పనిచేసే సెకండరీ స్కూల్, జూనియర్ కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలో మూడేళ్ల ఉపాధ్యాయులుగా పనిచేసిన వారు ఈ ఓటరు జాబితాలో పేరు నమోదుకు అర్హులన్నారు. ఓటరుగా నమోదు చేసుకునే వారు ఫారం-19ను పూర్తి చేసి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబర్ 3వ తేదీలోగా అందజేయాలని కోరారు.

ఉన్నతికి విద్యే బలం

తాడేపల్లిగూడెం: బాలికలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే విద్యేబలమని నిట్‌ను సందర్శించిన బాలికలతో నిట్ అధ్యాపకులు అన్నారు. బుధవారం విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మార్కాపురం, చిలకలూరిపేట, ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యార్థులు నిట్ సందర్శనకు వచ్చారు. డాక్టర్ వి.సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతీ అడుగు వారి విజయానికి మెట్టుగా నిలిచినపుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువుతో పాటు కృత్రిమ మేథస్సు, మిషన్‌లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాకెచెయిన్ టెక్నాలజీ, రోబోటిక్స్, బిగ్‌డేటా ఎనలిటిక్స్, వర్చువల్ రియాలిటీ, త్రీడీ ప్రింటింగ్ వంటి సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, కె.మాధురి, యామిని, బి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల చిన్నారుల జీవితాలలో వెలుగులు నింపాలని పలువురు దాతలు పేర్కొన్నారు. స్థానిక సుబ్బారావుపేట భవిత సెంటర్‌లో బుధవారం దాతలచే పిల్లలకు బిస్కెట్స్, చాక్లెట్స్, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల విద్యకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. బలివాడ సతీష్, మౌనిక, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, భారతి, జ్యోతిర్మయి, ఫిజియోథెరపీ వైద్యులు అల్లు శ్రీ కృష్ణ మహేష్, ఎం.చంద్రకుమారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి విరాళం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవీ భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి పెంటపాడుకు చెందిన భీమడోలు వెంకట్రావు - బేబి దంపతులు బుధవారం రూ.9వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ట్రస్ట్, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రొయ్యల సాగుకు ఎంపెడా గుర్తింపు తప్పనిసరి

ఆకివీడు: రొయ్యల పెంపకం చేపట్టే చెరువులకు ఎంపెడా గుర్తింపు తప్పనిసరి అని సాంకేతిక అధికారి దుర్గారావు చెప్పారు. స్థానిక మత్స్య శాఖ కార్యాలయంలో బుధవారం ఆక్వా రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మత్స్యశాఖ మండల అధికారి వి. రాంబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎంపెడా అధికారి దుర్గారావు మాట్లాడుతూ రొయ్యల పెంపకం ఎంత ముఖ్యమో వాటిని ఇతర దేశాల్లో విక్రయించడం కూడా అంతే ముఖ్యమన్నారు. డాలర్ల పంట పండించే రొయ్యలు సాగు ఎంత ఉందనేది నిర్ధారణ కాకపోవడం వల్లే ఇతర దేశాల్లో మన రొయ్యల అమ్మకానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 24 వేల ఎకరాల్లో రొయ్యల సాగు ఉన్నట్లు ఎంపెడాలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు గుర్తింపు లభించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 70 వేల ఎకరాలకు పైగా రొయ్యల సాగు జరుగుతోందన్నారు. ప్రతి రొయ్యల చెరువుకు ఆన్‌లైన్ ట్యాగింగ్ చేయాలన్నారు. జియో ట్యాగింగ్ గుర్తింపు పొందడం ద్వారానే ఇతర దేశాలకు రొయ్యలు ఎగుమతయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారు. మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంపెడా, అప్సడా అనుమతులతోనే రొయ్యల సాగు పట్టాలని అందుకోసం ప్రతి రైతు తమ సర్వే నంబర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కొన్నేళ్లుగా ఈ విధానం అమల్లో ఉన్నప్పటికీ ఎంపడా, అప్సడా రైతులకు ఎందుకు అవగాహన కల్పించలేదని ఆక్వా రైతు నంద్యాల చల్లారావు అధికారులను ప్రశ్నించారు. అధికారులు నిర్లక్ష్యం వల్లే రైతులు ఇంతవరకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోలేదన్నారు. ఆక్వా రైతుల ఇబ్బందులను ప్రభుత్వాలు ఎంపడా అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చాంబర్ అధ్యక్షుడు గొట్టుముక్కల సత్యనారాయణ రాజు మాట్లాడుతూ యాంటీబయోటిక్స్ నిషేధం ఉందని అవే ముందుల్ని పశువులకు వినియోగిస్తున్నారని అన్నారు. ఎరువుల షాపుల్లో అన్ని రకాలు మందులు విక్రయించాల్సి వస్తోందని, అధికారుల తనిఖీ సమయంలో ఇబ్బందులు పడుతున్నామని కొన్ని రకాల యాంటీబయోటిక్ మందుల విక్రయాలకు అనుమతులు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కేవీకే మత్స్య శాస్త్రవేత్త శ్రీనివాసరావు రొయ్యల సాగు చేపల పెంపకంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆక్వా రైతులు భగవాన్ రెడ్డి, కోపల్లె రాంబాబు, తిమ్మరాజు పలువురు రైతులు పాల్గొన్నారు.



రొయ్య రైతుల సదస్సులో మాట్లాడుతున్న ఎంపెడా అధికారి దుర్గారావు

నేడు ఎన్ఆర్ఈజీఎస్ ప్రజావేదిక

ఉండి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంపై ఈ నెల 15వ తేదీ నుంచి గ్రామస్థాయిలో నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమాలు ముగియడంతో ఈ నెల 24వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు మండల ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్ రవీంద్ర బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో గతేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా నిర్వహించిన ఉపాధి హామీ పనులు, సామాజిక పింఛన్లు, పంచాయతీ రాజ్ పనులపై ప్రిసైడింగ్ అధికారి ముందు సామాజిక తనిఖీ అధికారులు నివేదిక సమర్పించడంతో పాటు సమస్యలను కూడా చదివి వినిపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఎన్ఆర్ఈజీఎస్ పీడీ ప్రభాకరరావు, ఏపీడీ సుజాత, డీవీఓ విజయలక్ష్మి, ఎస్ఆర్‌వో గోవిందరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ఉపాధిహామీ కూలీలు, రైతులు హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

దశలవారీగా డ్రెయిన్ల ప్రక్షాళన

భీమవరం అర్బన్: జిల్లాలో దశలవారీగా డ్రెయిన్లలో సిల్టు, గుర్రపుడెక్క, కిక్కిస తొలగిస్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం మండలం గూట్లపాడు గ్రామంలో బుధవారం పొలిమేరతిప్ప డ్రెయిన్‌లో కిక్కిస, గుర్రపు డెక్క తొలగింపు పనులను కలెక్టర్ పరిశీలించారు. డ్రెయిన్లలో గుర్రపు డెక్క, కిక్కిస, సిల్టు తొలగించడం వల్ల వేలాది ఎకరాలు ముంపునకు గురికాకుండా రైతులకు ప్రయోజన చేకూరుతుందన్నారు. డ్రెయిన్ల ప్రక్షాళన శాశ్వత పరిష్కారానికి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. జిల్లాలో కొన్ని కాలువలు, డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు నిధులు మంజూరయ్యాయని, ఆ పనులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రూ.5 లక్షలతో గూట్లపాడులో పొలిమేరతిప్ప డ్రెయిన్ 1.95 కిలో మీటర్ల నుంచి 5.1 కిలో మీటర్ల వరకు కిక్కిస, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే నీటిపారుదల సాఫీగా జరిగి తోకతిప్ప, కొత్తపూసలమర్రు, గూట్లపాడు, లోసరి గ్రామాల్లో రెండు వేల ఎకరాల పొలాలను ముంపు బారినుంచి రక్షించవచ్చని చెప్పారు. కలెక్టర్ వెంట డ్రెయిన్ శాఖ ఈఈ సుబ్రహ్మణ్యేశ్వర రావు, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్, తహసీల్దార్ రావి రాంబాబు, మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్, రైతులు తదితరులు ఉన్నారు.



గూట్లపాడులో పొలిమేరతిప్ప డ్రెయిన్ పనుల రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన

కాళ్ల: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ చేపట్టిన భారత్ బంద్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో బుధవారం స్వచ్ఛందంగా అన్ని వర్గాల వారు అన్ని గ్రామాల్లోనూ వ్యాపారస్తులు దుకాణాలు, పాఠశాలలు బ్యాంకులు మూసివేశారు. ఆ గ్రామాల్లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు యువకులు బంద్ నిర్వహించారు. ప్రధానంగా ఏలూరుపాడులో అంబేడ్కర్ యువజన సంఘం యువకులు దుకాణాలు, పాఠశాలను మూసి వేయించి నిరసన తెలియజేశారు.

పాలకోడేరులో భారత్ బంద్ విజయవంతం

పాలకోడేరు : ఎస్సీ వర్గీకరణకు నిరసనగా దళితులు ఇచ్చిన భారత బంద్ పాలకోడేరు మండలంలో విజయవంతమైంది. విద్యాసంస్థలు, బ్యాంక్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్యసంస్థలను మూసి వేయించారు. పాలకోడేరు రావి చెట్టు సెంటర్‌లో దళిత సంఘాల నాయకులు కొద్దిసేపు నిరసన తెలిపారు. దళిత నాయకులు కోరం ముసలయ్య, పోతురాజు అశోక్, ఏపీ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కొండేటి లాజరు, పోతురాజు ఏసేపు, పారుపూడి రాహుల్, తాళ్లూరిసంతోష్ పాల్గొన్నారు.



పాలకోడేరు తహసీల్దార్ ఎన్ భారతి విజయలక్ష్మికి వినతి పత్రం అందిస్తున్న కొండేటి లాజరు, నాయకులు

ఎస్సీలు ఐక్యంగా ఉంటే చూడలేకపోతున్నారా?

ఉండి: ఎస్సీలు ఐక్యంగా ఉంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు కన్ను కుట్టిందని, అందుకే వర్గీకరణకు ఆసక్తి చూపుతున్నాయని మాలమహానాడు జిల్లా యువజన అధ్యక్షుడు చిగురుపాటి రాజేష్ ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎస్సీ సోదరులు బుధవారం తలపెట్టిన భారత్ బంద్ మండలంలో విజయవంతమైంది. మాలమహానాడు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు తొర్లపాటి భాగ్యరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు మేడిది సాయిజగన్నాథ్, మండలాధ్యక్షుడు పారుపూని రాహుల్ ఆధ్వర్యంలో ఎన్నార్పీ అగ్రహారం ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ర్యాలీగా వెళ్లి మండల వ్యాప్తంగా బంద్ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జీ చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆకివీడు మండలాధ్యక్షుడు నాగరాజు,ఉపాధ్యక్షుడు కేదాసి సూరిబాబు,నవీన్,క్రాంతి,రాజేష్, దాసు,సునీల్,మధు, చింటూ,అభిషేక్,వర్ధన్,రాజేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు బీఎల్వో విధులపై నిరసన

ఆకివీడు: అంగన్‌వాడీ వర్కర్లకు అదనపు బీఎల్వో బాధ్యతలు అప్పగించడంపై పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘ జిల్లా కార్యదర్శి డి.కల్యాణి మాట్లాడుతూ బీఎల్వో బాధ్యతల్ని అంగన్‌వాడీ కార్యకర్తలకు రాష్ట్రంలో ఎక్కడా అమలు చేయడన్నారు. స్థానికంగా అధికారులు అదనపు బాధ్యతలు కేటాయించడం వల్ల అంగన్‌వాడీలు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురవుతూ పిల్లలకు సరైన పోషణ అందజేయలేక పోతున్నారని వాపోయారు. బీఎల్వో విధులకు హాజరుకాకపోతే మెమోలు ఇస్తున్నారని పలువురు కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణకుమారి, భవానీ, సీతారామలక్ష్మి, బ్యూలా, రామలక్ష్మి, పలువురు సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానిక డీటీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, సీపీఎం నాయకులు

23న ఉపాధి హామీపై గ్రామ సభలు

పాలకోడేరు: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఈనెల 23న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నూకల మురళిగంగాధర్ రావు తెలిపారు. ఈ గ్రామ సభల్లో కొత్త జాబ్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని రోజుకు రూ.300 దినసరి వేతనం లభించేలా కొలతలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. గ్రామంలో చేపట్టాల్సిన కొత్త పనులను గుర్తిస్తారని ఎంపీడీవో తెలిపారు. కొండేపూడిలో ఉదయం 10 గంటలకు, విస్సాకోడేరు, మోగల్లు, గొల్లలకోడేరులో ఉదయం 10.30, గొరగనమూడి, గరగపర్రు, వేంద్రలో ఉదయం 11.30, వేంద్ర అగ్రహారం, పెన్నాడ అగ్రహారంలో మధ్యాహ్నం 12.30 గంటలకు, శృంగవృక్షం, మైపలో మధ్యాహ్నం మూడు గంటలకు, కుముదవల్లి, పాలకోడేరులో మధ్యాహ్నం రెండున్నర గంటలకు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామ సభలకు జాబు కార్డు కలిగిన లబ్ధిదారులు , గ్రామ ప్రజలు పాల్గొనాలని ఆయన తెలిపారు.

నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ఎన్నిక

ఉండి: నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ఉండి మండల నూతన కమిటీ ఎన్నికైనట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ సత్యనారాయణరాజు తెలిపారు. బుధవారం ఉండి ఎస్సీ స్పెషల్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో నిర్వహించిన ఎన్నికలో గౌరవాధ్యక్షుడిగా వై రమేష్, అధ్యక్షుడు పి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డి రాజేష్ ఆర్థిక కార్యదర్శి వై శ్యాంప్రసాద్, మహిళా కార్యదర్శిగా బీడీసీ కళావతిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెండవ ఎంఈవో వినాయకుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వితంతు మహిళలకు, ఒంటరి మహిళలకు, దీర్ఘకాలిక రోగులున్న వారికి పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. యూపీ స్కూల్లో రోల్ 98 కంటే ఎక్కువ ఉంటే ఆ పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులను ఇవ్వాలన్నారు. లేకపోతే ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్టీటీ ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో చూపించి ఆ పాఠశాలకు ఎంటీఎస్ ఉపాధ్యాలను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. భార్యాభర్తలు ఉపాధ్యాయులైతే ఇద్దరినీ ఒకే మండలంలో సర్దుబాటు చేయాలన్నారు.గత ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు వారి డ్యూటీ సర్టిఫికెట్ అనుసరించి సంపాదిత సెలవులను వారి ఎస్ఆర్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు నోబెల్ టీచర్స్ యూనియన్ నాయకులు తెలిపారు.



ఎంఈవో వినాయకుడికి వినతిపత్రం అందిస్తున్న నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నూతన ప్రతినిధులు

వైద్యురాలి హత్యను ఖండిస్తూ ధర్నా

భీమవరం: ట్రైనీ డాక్టర్‌పై హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం భీమవరంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ వైద్యురాలిపై హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సీబీఐతో విచారణ చేయాలని, వైద్యులు, మహిళలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అంగనవాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు సీహెచ్ మహాలక్ష్మి మాట్లాడుతూ దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు బి.వాసుదేవరావు, కలిపిండి సత్యనారాయణ, పి.శ్రీను,మాధవి, కె.అప్పన్న, కె.గోపాలరాజు, బంగారు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార ఘటనపై నిరసన

భీమవరం: కోలకత్తా లో ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యూటన్, ఎం శివ, చెల్లబోయిన రంగారావు, కోటేశ్వరరావు, శ్యామల పాల్గొన్నారు.



భీమవరంలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ముగ్గురు జూదరుల అరెస్టు

ఆకివీడు: అజ్జమూరులో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తుల్ని బుధవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

భీమవరం అర్బన్: బాల్య వివాహాలు చేసినా, వారిని ప్రోత్సహించినా చట్టపరంగా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని భీమవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం హెచ్చరించారు. భీమవరం మండలం అనాకోడేరులో అంగన్ వాడీ సెంటర్‌లో బుధవారం 100 రోజుల పాటు జరిగే మిషన్ శక్తి పథకంలో భాగంగా బాల్యవివాహాలు, మహిళలపై అత్యాచారాలు, వేధింపులు, దాడులపై అవగాహన కల్పించారు. లక్ష్మీకాంతం మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వాలు చట్టాలు ద్వారా భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే పౌష్టికాహారంపై హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఓటర్ నమోదు చేసుకోవాలి

కాళ్ల: ఏదైనా పాఠశాల, కాలేజీల్లో మూడేళ్ల ఉపాధ్యాయులుగా పని చేసిన వారు ఉపాధ్యాయ ఓటర్ లిస్టులో ఓటు నమోదుకు అర్హులని ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జున తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమ ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి కొత్త ఓటర్ లిస్ట్ తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశాలనుసారం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఏదైనా స్కూలు, కాలేజీల్లో మూడేళ్ల ఉపాధ్యాయునిగా పనిచేసిన వారు ఉపాధ్యాయ ఓటర్ లిస్ట్‌లో ఓటర్ నమోదుకు అర్హులని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి వాటర్‌గా నమోదు చేసుకునే వారు ఫారం 19లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ మూడవ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో స్వాతి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగార్జున

పంచాయతీ ఆదాయం వృద్ధికి కృషి చేయాలి

ఆకివీడు: వ్యర్థాలతో గ్రామాల్లో అనర్థాలకు చోటివ్వవద్దని ఎంపీడీఓ కందుల వాణి పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా బుధవారం మండల పరిషత్‌లో ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తల ద్వారా ఆదాయం పొందే మార్గాలిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో తెలియజేశామన్నారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలోనే గ్రామాల్లో జీపీడీపీ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు నిర్మించామన్నారు. తడి,పొడి చెత్తలు వేరు చేసి సేకరించేందుకు వాహనాల్ని సమకూర్చారని చెప్పారు. పంచాయతీలో తడి, పొడి చెత్తల్ని వేరుచేసి పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా వర్మీ కంపోస్టు తయారీకి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రజాప్రతినిధులు పంచాయతీల ఆదాయ వృద్ధికి కృషి చేయాలని సూచించారు. శిక్షణపూర్తయిన తరువాత సర్పంచ్‌లు, కార్యదర్శులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ముగిసిన శిక్షణ తరగతుల్లో కార్యదర్శి ఆనంద్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ వాణి

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

ఉండి: తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాందువ్వ శివారు ఖండ్రిక ప్రాంతానికి చెందిన పసుపులేటి సీతామహాలక్ష్మి తన భర్త (47) ప్రభాకరరావుకు మతి స్థిమితం లేదని, ఆయన ఈ నెల 17న రాత్రి భోజనం చేసి పడుకున్న అనంతరం ఉదయం లేచి చూసేసరికి ఆయన కనిపించలేదని తెలిపారు. ఆయన ఆచూకీ కోసం చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదుపై ఎస్సై ఎండీ నజీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు సేవ పూర్వజన్మ సుకృతం

ఆకివీడు: వృద్ధులకు సేవ చేయడం పూర్వ జన్మ సుకృతమని ఆకివీడు రూరల్ సీఐ వి.జగదీశ్వర రావు చెప్పారు. సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం బుధవారం లయన్స్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ వృద్ధులు దేవుళ్లతో సమానమని వారిని కంటికి రెప్పలా చూసుకోవలసిన బాధ్యత పిల్లలపై ఉందని చెప్పారు. మరో ముఖ్యఅతిథి నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ వృద్ధుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంఘ అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ 12 ఏళ్లుగా వృద్ధుల సంక్షేమంలో సంఘం పనిచేస్తుందని చెప్పారు. దాత పల్లి అప్పిరెడ్డి, మాజీ ఎంపీటీసీ, లయన్స్ కార్యదర్శి మోరా జ్యోతిరెడ్డి, లయన్స్ ప్రతినిధులు గొంట్లా కృష్ణ, కాకర్ల రాజేశ్వరి, ఎం.వీ.ఎస్. నాగమణి, అట్లూరి రంగారావు, వృద్ధుల సంఘ ప్రతినిధులు అడివి సుబ్బారావు, పేర్ల ప్రసాద్, షరీఫ్, అహ్మద్ పాల్గొన్నారు.



స్థానిక లయన్స్ ఆడిటోరియంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ జగదీశ్వరరావు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అత్తిలి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మహిళా సంరక్షణ అధికారిణి ఎం స్వప్నశ్రీ అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బేటీ పడావో-బేటీబచావో కార్యక్రమంపై అత్తిలి మండలం బల్లిపాడు ప్రాథమిక పాఠశాల వద్ద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వప్నశ్రీ మాట్లాడుతూ బాలికల చదువు భావితరాలకు వెలుగు అని అన్నారు. బాల్యవివాహాలు జరిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి నిర్మలకుమారి, డి నర్సవేణి, ఎం శివ సత్యవతి, సిహెచ్‌వీ రామలలిత, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

ఇరగవరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో ప్రమోదిని కుమారి, ఎం ఆషా రోహిణి అన్నారు. ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సుందర్ రాజు, ఎంఈవోలు ఎస్ శ్రీనివాస్ రావు, ప్రసాద్, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు మాణిక్యాంబ, ఎస్ కాంత కుమారి, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, విఆర్‌వోలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో 19వవార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు, బాలికలకు మహిళా చట్టాలపై అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. సూపర్‌వైజర్లు సీహెచ్‌కే దుర్గ, భవాని, కె విశాలాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి త్రివేణి, ఆర్ లక్ష్మి తులసి పాల్గొన్నారు.



బల్లిపాడులో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ అధికారిణి స్వప్నశ్రీ

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఈనెల 14న జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజీ పడ్డదగిన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, బీఎస్ఎన్ఎల్, బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల మధ్య రాజీ చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు.

హక్కుల పరిరక్షణపై అవగాహన

భీమవరం: దుకాణాల్లో పనిచేసే కార్మికులకు ఉండే ప్రత్యేక హక్కులకు భంగం వాటిల్లితే మండల న్యాయ సేవా సంస్థను ఆశ్రయించాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.యోహాన్ (న్యూటన్) అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ సంఘ భవనంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో షాపుల్లో పనిచేసే కార్మికుల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్మికులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల రాజీకి ప్రయత్నించాలని కక్షిదారులకు సూచించారు. కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.లక్ష్మి మాట్లాడుతూ బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, బడికి వెళ్లే వయస్సులో పనికి పంపరాదని అన్నారు. సదస్సులోఅసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం కిరణ్ కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ కె.వెంకట రమణారావు, బి.వాసుదేవరావు, ప్యానల్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బార్ అధ్యక్షుడు యోహాన్